# ఘనంగా బీవైఎస్ వసంత్ ఉత్సవ్


వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ రాధారాణి, డాక్టర్ సుధాకర్ యాదవ్, సుధీర్ కులకర్ణి


వసంత్ ఉత్సవ్‌లో యోగా సభ్యులు

**అబిడ్స్:** భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) వసంత్ ఉత్సవ్ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. బీవైఎస్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఆదివారం ఆనందోత్సవంగా గడిపారు. ఇందిరాపార్కులో జరిగిన వసంత్ ఉత్సవ్ వేడుకల్లో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రాధారాణి, డాక్టర్ సుధాకర్‌యాదవ్, భారతీయ యోగ్ సంస్థాన్ తెలంగాణ అధ్యక్షుడు సుధీర్ కులకర్ణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరంలోని పలు ప్రాంతాల యోగా సెంటర్ల బీవైఎస్ యోగా సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. తెలుగు, హిందీలో గీతాలు ఆలపిస్తూ వివిధ రకాల నృత్యాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంతమంతా మారుమ్రోగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాధారాణి, డాక్టర్ సుధాకర్ యాదవ్, సుధీర్ కులకర్ణి మాట్లాడుతూ..మారుతున్న యాంత్రిక జీవితంలో ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచేందుకు యోగా అతి ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్‌చారి, బ్రిజ్‌లాల్ తపాడియా, శ్రావణ్, నరేందర్ వాల్మియా, సత్యనారాయణ శిక్షక్, లతా శిక్షక్‌తో పాటు పెద్ద ఎత్తున యోగా నిర్వాహకులు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ల్యాబొరేటరీ షాపుల సీజ్

**అబిడ్స్:** నిబంధనలు పాటించని కెమికల్, ల్యాబొరేటరీ షాపులను అబిడ్స్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేశారు. అబిడ్స్ తిలక్ రోడ్డులోని స్కూల్, కాలేజీలకు చెందిన కెమికల్ ల్యాబొరేటరీల సామగ్రి విక్రయించే రెండు షాపులలో అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ ఏఎంఓహెచ్ శ్రీకాంత్‌రెడ్డి తమ బృందాలతో సంయుక్తంగా కలిసి తనిఖీలు చేపట్టారు. రెండు షాపుల్లో ఎలాంటి సేఫ్టీ మేజర్లు గాని, వ్యాల్యూడ్ లైసెన్స్‌గానీ, జీఎస్టీగాని లేకపోవడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. ప్రమాదకరమైన కెమికల్ ల్యాబొరేటరీ షాపుల్లో ఎలాంటి జాగ్రతలు తీసుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న రెండు దుకాణాలపై ఐపీసీ 336, 286 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, ఏఎంఓహెచ్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రమాదకరమైన కెమికల్స్ పదార్థాలు విక్రయించినప్పుడు షాపుల నిర్వాహకులు అన్ని నిబంధనలు పాటించాలన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు

# మార్చి 25 నుంచి సనాతన వేదాంత జ్ఞాన సభలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

**సుల్తాన్‌బజార్:** హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, శ్రీద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ట్రస్ట్, శ్రీ మలయాళ స్వామి భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణలో తొలిసారి మార్చి 25, 26, 27 తేదీల్లో బాలాపూర్‌లలో కులమతాలకు అతీతంగా 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు నిర్వహిస్తున్నామని కన్వీనర్ కాశెట్టి పాండుగుప్తా తెలిపారు. ఆదివారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ సభల్లో వివిధ ప్రాంతాల నుంచి వంద మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలతో పాటు మాతాజీలు పాల్గొని వారి అమూల్యమైన ప్రవచనాలను భక్తులకు అందజేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీపరిపూర్ణనందగిరి, శ్రీ అనంతానందగిరి స్వామి, బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక శాఖను కేటాయించాలి

**గన్‌ఫౌండ్రీ:** వయోధికుల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని కర్ణాటక హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర అఖిల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వయోవృద్ధుల సంక్షేమానికి దృష్టి సారించాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ..వయోధికులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలని, గతంలో రైల్వేలలో రాయితీలు ఉండేవని తిరిగి మరోసారి రాయితీలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సయ్య, కోశాధికారి కుమారాస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్‌రావు

# యువతను క్రీడారంగంలో ప్రోత్సహించాలి


క్రికెట్‌లీగ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

**గన్‌ఫౌండ్రీ:** మేరు కులస్థులకు చెందిన యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది క్రికెట్ లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం చైర్మన్ పాడిశెట్టి నర్సింగ్‌రావు తెలిపారు. ఆదివారం నిజాం కళాశాల మైదానంలో మేరు సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే మేరు క్రికెట్‌లీగ్ సీజన్–2ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..33 జిల్లాల నుంచి 21 టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. మేరు కులస్థులను ఏకం చేసి వారిని ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, సంఘం మాజీ అధ్యక్షుడు పి.చంద్రమోహన్, సభ్యులు జి.అరుణ్ కుమార్, రాపర్తి రవికుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం

**గోల్కొండ:** కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అహ్మద్‌కాలనీ, మోతీదర్వాజ, ఖాజీగల్లీ, ఎండిలైన్స్ చౌరస్తా, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఎండిలైన్స్ నుంచి కంపెనీ బాగ్ వరకు గల రోడ్డు గత కొన్ని నెలలుగా అధ్వానంగా తయారయ్యిందని పాదచారులు, ద్విచక్ర వాహనాదారులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించలేకపోతున్నారని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రదేశాలల్లో స్థానికులకు ఇబ్బందులు తప్పవని ఎండిలైన్స్ చౌరస్తా నుంచి కంపెనీ బాగ్ చౌరస్తా వరకు పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని ఆ పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన స్థానికులకు వివరించారు. అనంతరం ఆయన అహ్మద్‌కాలనీ, మోతీదర్వాజ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు మాజీద్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.


అహ్మద్‌కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

# బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

- బస్తీలు, వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు
- బెడదను నివారించాలని ప్రజల విన్నపం


గుడిమల్కాపూర్ ప్రధాన రహదారిపై కుక్కలు


చెత్త కుప్పల వద్ద..

**గోల్కొండ:** ప్రధాన రహదారులు, బస్తీలు, వీధుల్లో కుక్కలు నానా హంగామా సృష్టిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ కనబడ్డ వారి వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చెత్తకుప్పలు, రెస్టారెంట్ల ఎదుట తిష్టవేస్తున్నాయి. ముఖ్యంగా మెహిదీపట్నం చౌరస్తా, టోలిచౌకీ, షేక్‌పేట్ నాలా గుడిమల్కాపూర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపై తిరుగుతూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. టోలిచౌకీ చౌరస్తా వద్ద గల ఆలయం ముందు, లేబర్ అడ్డా వద్ద కూలీలను భయపెట్టిస్తున్నాయి. షేక్‌పేట్ నాలా బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనాదారుల వెంటపడుతుండడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. షేక్‌పేట్‌లో గత నెలలో ఓ కూలీ గుడిసెలోకి వెళ్లి 5 నెలల పిల్లవాడిని కరిచి చంపేశాయి. అలాగే గోల్కొండ బంజారా దర్వాజ, జమాలి దర్వాజ తదితర ప్రాంతాల్లోని కందకాల్లో పెద్ద సంఖ్యలో కుక్కలు ఉంటూ ట్రాఫిక్ సిగ్నల్ పడినప్పుడు వాహనాదారులను భయపెట్టేలా మొరుగుతున్నాయి. కొన్ని రోజులుగా బల్దియా వారి వీధిప్రాణులను పట్టే వాహనం వస్తున్నా కుక్కలను పట్టుకున్న దాఖలాలు లేవు. పలుమార్లు కుక్కలు ఇతర వీధి జంతువులపై దాడి చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. అలాగే ఎండీ లైన్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో కుక్కలు మేకలపై దాడి చేసి గాయపర్చాయి. మరోవైపు పర్యాటక ప్రాంతాలైన గోల్కొండ కోట, సెవన్ టూంబ్స్, డెక్కన్ పార్కు తదితర ప్రాంతాల్లోనూ కుక్కల బెడద పెరిగిపోవడంతో పర్యాటకులు భయపడుతున్నారు. అహ్మద్‌నగర్‌లోని చాచా నెహ్రూ పార్కు పరిసరాల్లో సైతం కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## రేపు జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవ ర్యాలీ

**అఫ్జల్‌గంజ్:** జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవం ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వెనిరియాలజిస్ట్, లెప్రాలజిస్ట్‌ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకటకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న అంబేడ్కర్ సచివాలయం వద్ద ఉదయం 7 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరం, శివారు ప్రాంతాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు, చర్మవ్యాధి నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు, రేపు మెగా హెల్త్ క్యాంప్


**గోల్కొండ:** నేడు, రేపు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని సహాయత ట్రస్ట్ ప్రతినిధి హాఫీజ్ ఇర్ఫాన్ నజీబ్ తెలిపారు. ఇండో యూఎస్ ఆసుపత్రి వారి సహకారంతో 13వ ఇండియా హెల్త్ ఇనిషియేటివ్‌లో భాగంగా గోల్కొండ నయాఖిలాలోని ఉర్వా హైస్కూల్‌లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రెండు రోజుల పాటు జరిగే ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందిస్తారని, వైద్య పరీక్షలతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని ఆయన తెలిపారు.

## పోస్టర్ ఆవిష్కరణ



**నాంపల్లి:** ప్రముఖ మెజీషియన్ విజయ్‌కాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'నా ఊరు..ఆ రోజుల్లో' తెలుగు సినిమా పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ చిత్రంలో త్వరలోనే తెర మీదకు రావాలని, ప్రేక్షక ఆదరణ పొంది చిత్రం యూనిట్ మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నటుడు షాని (బిగ్ బాస్ ఫేమ్), నిజాం కళాశాల ఫ్యాకల్టీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ సుధాకర్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్ కె.మల్లేశం పాల్గొన్నారు.

## బి.జి.సురేష్‌కు జ్యోతిషరత్న అవార్డు



**గోల్కొండ:** అవార్డులు సమాజం పట్ల ఉన్న బాధ్యతను మరింత పెంపొందిస్తాయని ఆసీఫ్‌నగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ బి.జి.సురేష్ అన్నారు. విశ్వజ్యోతిష విజ్ఞాన సంస్థ వారు ఆయనకు ఆదివారం సంస్థ కార్యాలయంలో జ్యోతిషరత్న అవార్డును అందజేశారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ దేవస్థానం ప్రధాన ఆచార్యులు ఎస్.నర్సింహ్మాచార్యులు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఒక వైపు ఉద్యోగం చేస్తునే విజయవాడకు చెందిన ప్రముఖ జ్యోతిషులు పి.శ్రీనివాస రావు వద్ద తాను జ్యోతిషం నేర్చుకున్నానని ఈ సందర్భంగా బి.జి సురేష్ పేర్కొన్నారు.

## ఓటుకు ఆధార్‌కార్డు లింక్ చేయాలి

**గన్‌ఫౌండ్రీ:** ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశ అభివృద్ధికి ఓటు హక్కు ఎంతో కీలకమని తొలగించబడిన 26 బీసీల కులాల సమితి చైర్మన్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సావిత్రిబాయిపూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు సామాజికవేత్తలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఓటును ఆధార్‌కార్డుతో లింక్ చేయాలని సూచించారు. అనంతరం పలువురు సీనియర్ పాత్రికేయులు, సాహితీవేత్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ యాదవ్, సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోపి, సీనియర్ జర్నలిస్టు ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే ధ్యేయం

**నాంపల్లి:** కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఎస్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య చెప్పారు. ఆదివారం హైదరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో 36 ఏళ్ల పాటు సేవలందించిన చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వి.ఎన్.చౌదరికి అభినందన సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మర్రి రాఘవయ్య కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అభ్యున్నతికి చౌదరి నిరంతరం శ్రమించిన నాయకుడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఫిరోజ్ ఖాన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ జోన్ సంయుక్త ప్రధాన కార్యదర్శి భానుప్రసాద్, హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి డి.వి.ప్రసాద్, సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి ప్రభురాజ్, నేతలు వి.నాగమురళీకృష్ణ, కె.మురళీకృష్ణ, ఎ.ఎస్.ప్రసాద్, వి.ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎస్.వి.ఎన్.చౌదరిని అభినందిస్తున్న మర్రి రాఘవయ్య

# కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఆదరణ


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఉస్మాన్ బిన్ మహ్మద్ ఆల్‌హాజరీ

**గోల్కొండ:** కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ ఆల్‌హాజరీ అన్నారు. ఆదివారం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకొని విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో అమ్జద్‌ఖాన్, అబ్దుల్లా, రఘు తదితరులున్నారు.

# భూదాన్ యజ్ఞ బోర్డును పునరుద్ధరించండి

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణలో భూదాన్ యజ్ఞ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని అఖిలభారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ తెలంగాణ ప్రభారీ షేక్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గాంధీభవన్ వద్ద గల తెలంగాణ సర్వోదయ మండలి కార్యాలయంలో రాష్ట్ర సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. ఆచార్య వినోభ భూమిలేని పేద రైతుల కోసం స్వీకరించిన భూములు అన్యాక్రాంతమైపోయాయని ఆరోపించారు. భూదాన్ భూములను కబ్జా చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అఖిలభారత సర్వ సేవా సంఘ్ దక్షిణ భారతదేశ ఇన్‌చార్జిగా ఎం.కృష్ణప్రసాద్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షేక్ హుస్సేన్ తదితరులు

# ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు

- ఇష్టానుసారంగా వాహనాల డ్రైవింగ్
- సిగ్నల్స్ ఉన్నప్పటికీ పట్టించుకోని వాహనదారులు
- స్పెసల్ డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటున్నాం: ట్రాఫిక్ ఏసీపీ


చంద్రశేఖర్‌రెడ్డి, దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ

**చార్మినార్:** పాతబస్తీలో ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరవుతున్నాయి. కొంత మంది వాహనదారులు తమ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ఇతరులకు ట్రాఫిక్ సమస్యలను కలిగిస్తున్నారు. ఎన్ని చలాన్లు విధించి, నిఘా పెట్టినా.. అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్లలో సైతం యువతీ యువకులు దూసుకెళ్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ.. కొంత మంది ద్విచక్ర వాహనదారులు పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసుల కళ్లుగప్పి త్రిబుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంటుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు : ట్రాఫిక్ ఏసీపీ

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల బారి నుంచి తమను తాము కాపాడుకోవడమే కాకుండా ఇతరులకు ప్రమాదాలు కలిగించరాదంటూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం ఆయన పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఆర్టీఏ ద్వారా మంజూరైన సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను కొంతమంది వాహనదారులు ఉద్దేశపూర్వకంగా మార్పులు, చేర్పులు చేస్తూ ఆర్టీఏ, ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఇప్పటికే తాము ఇటీవల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేసిన వాహనాలను సీజ్ చేశామన్నారు.

## శుభాకాంక్షలు



**చార్మినార్:** కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి, టీపీసీసీ కార్యదర్శి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**చార్మినార్:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి అన్నారు. మాదన్నపేట్‌కు చెందిన వెంకట రుద్రగౌనీ, దర్శనం పవన్ తదితరులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరినందున ఆయన అభినందించి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం తమ పార్టీ అభ్యర్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారని ఆయన తన ఆశాభావం వ్యక్తం చేశారు.


యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అలీ మస్కతి

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


రాచకొండ ఏసీపీ ఎస్.ఎన్. జావిద్‌తో మహ్మద్ నజీబ్

**గోల్కొండ:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాచకొండ రోడ్ సేఫ్టీ విభాగం ఏసీపీ సయ్యద్ నయిముద్దీన్ జావిద్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఆన్‌లైన్ గేమింగ్, డ్రగ్స్‌తో నేడు యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనేజేషన్ వారు యువకులకు ముఖ్యంగా విద్యార్థులకు దురలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

## నియామకం


ముజీబ్ హుస్సేనిని అభినందిస్తున్న అధ్యక్షుడు స్వామిగౌడ్

**అబిడ్స్:** తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో–ఆపరేటివ్ గచ్చిబౌలి కార్యదర్శిగా టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సొసైటీ అధ్యక్షుడు కె.స్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బోర్డు సమావేశంలో డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సొసైటీని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు స్వామిగౌడ్, కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, హౌసింగ్‌బోర్డు డైరెక్టర్లకు ముజీబ్ హుస్సేని కృతజ్ఞతలు తెలిపారు.

## ఎగ్జిబిషన్‌కు పోటెత్తిన సందర్శకులు



**అబిడ్స్:** ఎగ్జిబిషన్ సందర్శకులతో కిక్కిరిసింది. 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)కు ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జనవరి 1న ప్రారంభమైన ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 15న ముగియనుంది. ఆదివారం నగరం నుంచే కాక పలు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలిరావడంతో ఎగ్జిబిషన్ జనసంద్రంగా మారింది. ఎగ్జిబిషన్ పరిసరాలు, లోపల సందర్శకుల కోసం సొసైటీ ఆధ్వర్యంలో పలు ఏర్పాటు చేశామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి రాజేందర్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరాలతో నిఘా చేయడంతో పాటు తమ వలంటీర్లు సందర్శకులకు సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లు అన్ని కిక్కిరిసిపోయాయి.

## పర్యాటకుల సందడి



**గోల్కొండ:** గోల్కొండ కోటకు ఆదివారం వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కోట టికెట్ కౌంటర్ ముందు క్యూ కట్టారు. కోటలోని ఫిరంగులు, కోట గోడలను చూస్తూ పర్యాటకులు అబ్బో ఆనాటి కోట అంటూ అబురపడ్డారు. విజ్ఞాన వినోద యాత్రకు వచ్చిన విద్యార్థులు కోటలోని నగీనాబాగ్, ప్రధాన ద్వారం, ఆయుధాగారాల్లో ఉన్న 500 ఏళ్ల క్రితం నాటి ఆయుధాలను చూసి ఆశ్చర్యపోయారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**చార్మినార్:** చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫతేదర్వాజ, ఖిల్వత్ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. రాంనాస్‌పురా, మోచీకాలనీ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ప్రిన్స్‌కాలనీ, చందులాల్‌బారాదరి తదితర రెండు విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**హిందీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..**

**అఫ్జల్‌గంజ్:** 11 కేవీ హిందీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చర్చ్ పిటి, హిందీనగర్, కొత్త, పాత పోలీస్ క్వార్టర్స్, చాక్నావాడి, సనా ట్రాన్స్‌పోర్టు, రజక్‌పురా తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ సీతారామ్‌పేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పటేల్ నగర్, గౌస్‌పురా, సేవక్‌నగర్, సుభాన్‌పురా, దర్గాశాఖమోస్, ఏక్‌మినార్ మజీద్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.